సాక్షి
ఆదిలాబాద్

అస్వస్థతతోనే సమావేశానికి ఎమ్మెల్యే బొజ్జు



కైలాస్‌నగర్: ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అస్వస్థతకు గురైనప్పటికీ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో బుధవారం నిర్వహించిన ప్రజాపాలన సమావేశానికి హాజరయ్యారు. అనారోగ్యానికి గురైన ఆయన మంగళవారం రాత్రి సమయంలో ఉట్నూర్ ప్రభుత్వ ఆస్పత్రిలో చేరి చికిత్స పొందారు. విషయం తెలుసుకున్న మంత్రి సీతక్క ఆయనను ఉదయం పరామర్శించారు. వైద్యులు నాలుగు రోజులు విశ్రాంతి తీసుకోవాలని సూచించినప్పటికీ కలెక్టరేట్‌లో ముఖ్యమైన సమావేశం కావడంతో ఆయన చేతికి క్యాన్లతోనే హాజరవడం గమనార్హం.

గరిష్టం/కనిష్టం
29.0/16.0

వాతావరణం
ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. గాలిలో తేమశాతం పెరగనుంది. రాత్రి పూట చలి ప్రభావం కనిపిస్తుంది.

గురువారం • 28 • డిసెంబర్ • 2023

న్యూస్‌రీల్

మంత్రి సీతక్కకు వినతుల వెల్లువ

కైలాస్‌నగర్: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వివిధ వర్గాల వారి నుంచి మంత్రి సీతక్కకు వినతులు వెల్లువెత్తాయి. కలెక్టరేట్, జిల్లా పరిషత్, ప్రజాసేవభవన్‌లో మంత్రిని కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. వేతన బకాయిలు చెల్లించడంతో పాటు ఎంప్లాయ్ ఐడీలను జారీ చేయాలని జూనియర్ అసిస్టెంట్లుగా పనిచేస్తున్న వీఆర్‌ఏలు విన్నవించారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా మంజూరైన రుణాల సబ్సిడీ నిధులు విడుదల చేయాలని ఎమ్మార్పీఎస్ నేతలు కోరారు. చాలీచాలని వేతనాలతో 16 ఏళ్లుగా పనిచేస్తున్న తమ సేవలను క్రమబద్ధీకరించాలని ఉపాధి హామీ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ విన్నవించారు. ఉపాధ్యాయుల పదోన్నతులు చేపట్టాలని టెట్ క్వాలీఫైడ్ ఫోరం నాయకులు కోరారు. తమ సర్వీస్‌ను రెగ్యులరైజ్ చేయాలని సమగ్ర శిక్ష ఉద్యోగులు విన్నవించారు. ఇంటి స్థలాలను అందజేయాలని జర్నలిస్టు సంఘాల నాయకులు వినతిపత్రాలు అందజేశారు. విన్నపాలను సానుకూలంగా ఆలకించిన మంత్రి వాటి పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటామని భరోసానిచ్చారు. వినతిపత్రాలు అందజేసిన వారిలో ఆయా సంఘాల నాయకులు, ఉద్యోగులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

మార్కెట్ వైస్‌చైర్మన్ రాజీనామా ఆమోదం

బోథ్: ఈ నెల 23న బోథ్ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ సంజీవ్‌రెడ్డి తన పదవికి రాజీనామా చేశారు. ఈ క్రమంలో మార్కెట్ కమిటీ పాలకవర్గ ప్రత్యేక సమావేశం బుధవారం నిర్వహించారు. ఇందులో సంజీవ్‌రెడ్డి రాజీనామాను పాలకవర్గం ఏకగ్రీవంగా ఆమోదించింది. ఆమోదించిన ప్రతిని ప్రభుత్వానికి పంపించనున్నట్లు జిల్లా మార్కెటింగ్ అధికారి శ్రీనివాస్, మార్కెట్ కార్యదర్శి దేవన్న తెలిపారు. అయితే జిల్లా మార్కెటింగ్ అధికారి తీరు నచ్చకనే తాను రాజీనామా చేస్తున్నట్లు సంజీవ్‌రెడ్డి తన రాజీనామాలో పేర్కొన్నారు. అయితే పాలకవర్గం మాత్రం సంబంధిత అధికారిపై వచ్చిన ఆరోపణలపై వివరణ కోరకుండానే వైస్‌చైర్మన్ రాజీనామాను ఆమోదింపజేయడం గమనార్హం.

పత్తికి రూ.2వేల బోనస్ అందించాలి

ఇచ్చోడ: పత్తి క్వింటాల్‌కు రూ.2వేల బోనస్ అందించి రైతులను ఆదుకోవాలని రైతు స్వరాజ్యవేదిక జిల్లా అధ్యక్షుడు సంగెం బొర్రన్న డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో రైతులతో కలిసి బుధవారం ఆయన మాట్లాడారు. ఈ ఏడాది పత్తి పంట దిగుబడి భారీగా తగ్గడంతో పాటు గిట్టుబాటు ధర లేక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం స్పందించి పత్తి రైతులకు బోనస్ అందించి ఆదుకోవాలని కోరారు. అలాగే ఇచ్చోడ మార్కెట్ యార్డు పరిధిలో సీసీఐ అధికారులు పత్తి కొనుగోళ్లలో తీవ్ర జాప్యం చేస్తున్నారని మండిపడ్డారు. ఆయన వెంట స్థానిక రైతులు ఉన్నారు.

నలుగురు విద్యార్థినులు అదృశ్యం..

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని సరస్వతినగర్‌లో గల ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థినులు బుధవారం అదృశ్యమయ్యారు. పాఠశాలకు వెళ్తామని ఇంటి నుంచి వెళ్లిన విద్యార్థులు తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు ఆరా తీయగా.. పాఠశాలకు వెళ్లలేదని తేలింది. ఈమేరకు మావల పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్పీ వెంటనే స్పందించి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయగా వారు నిజామాబాద్ జిల్లాకు వెళ్లినట్లు పోలీసులు గుర్తించారు. వారి వద్ద ఉన్న సెల్‌ఫోన్ ఆధారంగా వారి ఆచూకీ గుర్తించినట్లు సమాచారం. వారిని అక్కడ నుంచి తీసుకువచ్చేందుకు పోలీసులు చర్యలు చేపట్టినట్లు తెలిసింది. దీనికి సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

మారిన రాజకీయం



- జిల్లాలో ఆసక్తికరంగా అసెంబ్లీ ఫలితాలు
- బీఆర్‌ఎస్ కోటకు బీటలు
- ఆదిలాబాద్‌లో బోణీ కొట్టిన బీజేపీ
- ఖానాపూర్‌కే పరిమితమైన కాంగ్రెస్
- బోథ్, ఆసిఫాబాద్‌లో పట్టు నిలుపుకున్న గులాబీ పార్టీ
- పొలిటికల్ ఇయర్ రౌండప్ -2023

రాష్ట్ర రాజకీయాల మాదిరిగానే జిల్లా రాజకీయాల్లోనూ ఈఏడాది ముఖచిత్రం మారిపోయింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటికీ ఉమ్మడి ఆదిలాబాద్‌లోని పశ్చిమ జిల్లాలో బీజేపీ ప్రభంజనం కనిపించింది. అధికార హస్తం పార్టీ ఒకే ఒక ఖానాపూర్ నియోజకవర్గంలో గెలుపొందింది. ఇక బోథ్, ఆసిఫాబాద్‌లో సిట్టింగ్ ఎమ్మెల్యేలను మార్చి ఇతరులకు టికెట్ ఇవ్వగా, ఈ రెండు చోట్ల బీఆర్‌ఎస్ పట్టు నిలుపుకుంది. నవంబర్ 30న శాసనసభ ఎన్నికలు నిర్వహించగా, డిసెంబర్ 3న ఫలితాలు వెలువడ్డాయి.

–సాక్షి, ఆదిలాబాద్

ప్రచారంలో మహామహులు..
ఎన్నికల ప్రచారంలో భాగంగా జిల్లాకు ఆయా పార్టీల జాతీయ, రాష్ట్ర నాయకులు విచ్చేశారు. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ఆదిలాబాద్ సభలో పాల్గొనగా, ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, ముఖ్య నేతలు ఈటల రాజేందర్, బండి సంజయ్ ప్రచారపర్వంలో భాగస్వాములయ్యారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆదిలాబాద్‌లో నిర్వహించిన బహిరంగ సభలో పాల్గొన్నారు. బీఆర్‌ఎస్ నుంచి కేసీఆర్ జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో పర్యటించారు. టీపీసీసీ అధ్యక్ష హోదాలో రేవంత్‌రెడ్డి ఆదిలాబాద్, బోథ్, ఉట్నూర్ సభల్లో పాల్గొన్నారు. వీరితో పాటు హరీశ్‌రావు, బీజేపీ తరఫున మహారాష్ట్ర సీఎం ఏక్‌నాథ్ షిండే, కాంగ్రెస్ తరఫున ఛత్తీస్‌గఢ్ అప్పటి సీఎం భూపేష్ భగేల్, మహారాష్ట్ర మాజీ సీఎం అశోక్‌రావు చౌహాన్ కూడా పర్యటించారు.

కొత్త ఎమ్మెల్యేలుగా..



పాయల్ శంకర్, ఆదిలాబాద్ ఎమ్మెల్యే



అనిల్ జాదవ్, బోథ్ ఎమ్మెల్యే



వెడ్మ బొజ్జు, ఖానాపూర్ ఎమ్మెల్యే



కోవలక్ష్మి, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే

జిల్లా పరిధిలోకి వచ్చే ఆయా నియోజకవర్గాల్లో ఈ సారి ఫలితాలు విభిన్నంగా వచ్చాయి. ఎమ్మెల్యేలుగా ఆదిలాబాద్ నుంచి బీజేపీ అభ్యర్థి పాయల్ శంకర్, బోథ్‌లో బీఆర్‌ఎస్ అభ్యర్థి అనిల్ జాదవ్ విజయం సాధించారు. అలాగే ఖానాపూర్‌లో కాంగ్రెస్ అభ్యర్థి వెడ్మ బొజ్జు, ఆసిఫాబాద్‌లో బీఆర్‌ఎస్ అభ్యర్థి కోవ లక్ష్మి గెలుపొందారు.

గులాబీ పార్టీకి చుక్కెదురు..
గతంలో జిల్లా పరిధిలోని నాలుగు నియోజకవర్గాల్లో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలే కొనసాగగా ఈ సారి పరిస్థితి మారిపోయింది. గులాబీ పార్టీ రెండు స్థానాలకే పరిమితం కావాల్సి వచ్చింది. ఎన్నికల ముందు వరకు ఆదిలాబాద్‌లో జోగు రామన్న, బోథ్‌లో రాథోడ్ బాపూరావు, ఖానాపూర్‌లో రేఖానాయక్, ఆసిఫాబాద్‌లో సక్కు ఎమ్మెల్యేలుగా కొనసాగారు. తాజాగా జరిగిన ఎన్నికల్లో గెలిచిన వారిలో ఇందులో ఒక్కరు కూడా లేకపోవడం గమనార్హం. పార్టీ అధిష్టానం మూడు చోట్ల అభ్యర్థులను మార్చిన నేపథ్యంలో బోథ్‌లో అనిల్‌జాదవ్, ఆసిఫాబాద్‌లో కోవ లక్ష్మి మాత్రం విజయం సాధించారు.

పర్వాలేదనిపించిన బీజేపీ
ఈ ఏడాది బీజేపీకి కలిసివచ్చిందని చెప్పవచ్చు. జిల్లా పరిధిలోకి వచ్చే నాలుగు స్థానాల్లో ఆదిలాబాద్ స్థానాన్ని ఆ పార్టీ కైవసం చేసుకుంది. మొత్తంగా జిల్లాలో కమలం పార్టీబోణీ కొట్టింది.

కాంగ్రెస్‌కూ ఒక్కటే..
రాష్ట్రంలో కాంగ్రెస్ హవా కొనసాగినా జిల్లాలో మాత్రం ఆపార్టీ అనుకున్న ఫలితాలు రాబట్టుకోలేక పోయింది. ఖానాపూర్ మాత్రమే కైవసం చేసుకుంది.

జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా సీతక్క..
రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత ఈనెల 21న జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా సీతక్క నియమితులయ్యారు. ఇదిలా ఉంటే గురువారం నాగ్‌పూర్‌లో జరిగే కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవ సదస్సు సన్నాహక సమావేశాన్ని ఈనెల 25న ఆదిలాబాద్‌లో నిర్వహించగా, ఇద్దరు మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్‌గౌడ్ హాజరయ్యారు.

అర్హులందరికీ ఆరు గ్యారంటీలు



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

- అధికారులు, ప్రజాప్రతినిధులు జోడెద్దుల్లా పనిచేయాలి
- ప్రజల జీవన ప్రమాణాలు పెంచేలా కృషి చేయాలి
- రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క
- ప్రజా పాలనపై ఉమ్మడి జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులతో సమీక్ష

ప్రజా పాలన ఉమ్మడి జిల్లా నోడల్ అధికారిగా ఎం.ప్రశాంతి
రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ పర్యవేక్షణకు గాను ఉమ్మడి జిల్లాల వారీగా నోడల్ అధికారులను ప్రభుత్వం నియమించింది. ఇందులో భాగంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు ఐఏఎస్ ఎం.ప్రశాంతిని నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

కైలాస్‌నగర్: ప్రజల సంక్షేమం, అభివృద్ధి దిశగా ప్రభుత్వం చేపట్టిన ఆరు గ్యారంటీలను పకడ్బందీగా అమలు చేసి అర్హులైన ప్రతి ఒక్కరికి అందించేలా కృషి చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటిపారుదల, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. ఈ నెల 28 నుంచి జనవరి 6 వరకు నిర్వహించనున్న ప్రజాపాలన కార్యక్రమ నిర్వహణపై ఆదిలాబాద్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉమ్మడి జిల్లా సన్నాహక సమీక్ష బుధవారం నిర్వహించారు. నాలుగు జిల్లాల ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించి ప్రజాపాలన విజయవంతానికి అనుసరించాల్సిన కార్యాచరణపై దిశా నిర్దేశం చేశారు. అనంతరం మీడియా సమావేశంలో ఆమె వివరాలు వెల్లడించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు జోడెద్దుల్లా జిల్లా అభివృద్ధి కోసం కలిసికట్టుగా కృషి చేయాలని సూచించారు. గ్రామస్థాయి నుంచి అభివృద్ధి జరిగేలా మండల, జిల్లాస్థాయి అధికారులు ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని సూచించారు. ప్రజల జీవన ప్రమాణాలు పెంచేవిధంగా ప్రభుత్వ పథకాలను అమలు చేయాలన్నారు. ప్రజాస్వామ్యాన్ని నమ్ముకున్న, ప్రజా పాలనకు కట్టుబడి ఉన్న ప్రభుత్వంగా ఇచ్చిన ప్రతి హామీని నేరవేరుస్తామన్నారు. ఈ నెల 9న రాష్ట్రవ్యాప్తంగా బాలికలు, మహిళలకు ఉచిత రవాణ సౌకర్యాన్ని లాంఛనంగా ప్రారంభించడంతో పాటు రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకం పరిమితిని రూ.5లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచినట్లు గుర్తు చేశారు. ఈ నెల 28నుంచి జనవరి 6 వరకు మహాలక్ష్మి, రైతు భరోసా, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇండ్లు, చేయూత పథకాల కోసం అన్ని గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీల్లో దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. ఇందుకు పూర్తిస్థాయి ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ప్రజల స్థితిగతులకనుగుణంగా సర్వతోముఖాభివృద్ధి కోసం కృషి చేయాలన్నారు. గిరిజనుల సంక్షేమం, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి కోసం అంకితభావంతో పని చేయాలన్నారు. జిల్లాలో అన్ని ప్రాంతాల అభివృద్ధికి కృషి చేయడంతో పాటు విద్య, వైద్యం, సంక్షేమం, రహదారుల అనుసంధానం వంటి కార్యక్రమాలను అమలు చేసేందుకు ఆదర్శవంతమైన ప్రణాళికలు రూపొందించాలని తెలిపారు. ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను పరిష్కరించేందుకు, ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారంటీలను అర్హులందరికీ అందించేందుకు, రాజకీయాలకు అతీతంగా కలిసి రావాలని కోరారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు పొరుగున ఉన్న మహారాష్ట్ర నుంచి వలసలు నియంత్రించడం, ప్రభుత్వ పథకాలను దుర్వి నియోగం కాకుండా అర్హులైన వారికి అందించేందుకు పర్యవేక్షణ కోసం ప్రత్యేక అధికారిని నియమించనున్నట్లు తెలిపారు. అనంతరం ప్రజా పాలన అభయ హస్తం, ఆరు గ్యారంటీలకు శ్రీకారం పోస్టర్లను మంత్రి ఆవిష్కరించారు. కలెక్టరేట్ సమావేశ మందిరానికి చేరుకున్న మంత్రికి ప్రజాప్రతినిధులు, అధికారులు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్లు జనార్దన్ రాథోడ్, విజయలక్ష్మి, కోనేరు కృష్ణారావు, బెల్లంపల్లి, ఖానాపూర్ ఎమ్మెల్యేలు గడ్డం వినోద్, వెడ్మ బొజ్జు పటేల్, మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్, ఆదిలాబాద్, నిర్మల్, ఆసిఫాబాద్ జిల్లాల ఎస్పీలు ఉదయ్‌కుమార్‌రెడ్డి, ప్రవీణ్ కుమార్, సురేశ్‌కుమార్, మంచిర్యాల డీసీపీ సుధీర్ రాంనాథ్, అదనపు కలెక్టర్లు ఖుష్బూ గుప్తా, ఫైజాన్ అహ్మద్, దీపక్ తివారి, సబావత్ మోతి లాల్, ప్రత్యేకాధికారులు, ఎంపీడీవోలు, ఎంపీవోలు, తహసీల్దార్లు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ధ్యేయం

- అర్హులందరికీ కేంద్ర పథకాలు
- ఎంపీ సోయం బాపూరావు
- వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర ప్రచార రథం ప్రారంభం




లబ్ధిదారుకు గ్యాస్ కనెక్షన్ ప్రొసీడింగ్ అందజేస్తున్న ఎంపీ సోయం

ఆదిలాబాద్: పేదల సంక్షేమమే ధ్యేయంగా, అర్హులందరికీ కేంద్ర ప్రభుత్వ పథకాలను అందిస్తామని ఎంపీ సోయం బాపూరావు అన్నారు. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్‌లో వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర ప్రచార రథాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ముందుగా అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులు అర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. నిరుపేదల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తుందన్నారు. అయితే క్షేత్రస్థాయిలో అవగాహన లేక ఎంతోమంది ఈ పథకాలకు దూరమవుతున్నారన్నారు. అర్హులందరికీ లబ్ధి చేకూర్చాలనే లక్ష్యంతోనే కేంద్ర ప్రభుత్వం వికసిత్ భారత్ సంకల్పయాత్ర ప్రచార కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. అధికారులు సైతం క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ కేంద్ర పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. ఈ సందర్భంగా ఎంపీ పలువురు లబ్ధిదారులకు ఆయుష్మాన్ భారత్ కార్డులు, గ్యాస్ సిలిండర్లు అందజేశారు. కార్యక్రమంలో సెంట్రల్ బ్యూరో కమ్యూనికేషన్ ఫీల్డ్ పబ్లిసిటీ ఆఫీసర్ బి.ధర్మనాయక్, ఎస్‌బీఐ రీజినల్ మేనేజర్ శ్రీనివాస్, డిస్ట్రిక్ట్ లీడ్ బ్యాంకు మేనేజర్ కె.ప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆదినాథ్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు చిట్యాల సుహాసినిరెడ్డి, నాయకులు విజయ బోయర్, పాయల్ శరత్, ఓఎంసి డీఎస్‌వో మహేష్ మిట్ట, పోస్టల్ శాఖ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ అంజూబాయి పాల్గొన్నారు.

అన్ని వర్గాల సంక్షేమానికి కృషి
ఇచ్చోడ: అన్ని వర్గాల సంక్షేమానికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కృషి చేస్తుందని, ఇందులో భాగంగా అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని ఎంపీ సోయం బాపూరావు అన్నారు. మండలంలోని గుండాలలో పీఎం భారత్ వికసిత్ సంకల్ప్ యాత్రలో భాగంగా బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అనంతరం మండల కేంద్రంలో హత్యకు గురైన వానోలే ఈశ్వర్ కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట పార్టీ నాయకులు జీవీ రమణ, బాలజీ ఉన్నారు.

నేటి నుంచి 'ప్రజా పాలన'

- ఇక జనం వద్దకే అధికారులు
- సంక్షేమ పథకాల మంజూరుకు దరఖాస్తుల స్వీకరణ
- గ్రామాలు, వార్డుల వారీగా షెడ్యూలు ప్రకటన
- వచ్చే నెల 6 వరకు కార్యక్రమం



సంక్షేమ పథకాలకు స్వీకరించనున్న దరఖాస్తు ప్రొఫార్మా

కైలాస్‌నగర్: జిల్లాలో ప్రజా పాలన కార్యక్రమ నిర్వహణకు సర్వం సిద్ధమైంది. ఈ నెల 28 నుంచి జనవరి 6వరకు నిర్వహించనున్న ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈమేరకు కలెక్టరేట్‌లో నాలుగు జిల్లాల ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులతో ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క బుధవారం సమీక్ష నిర్వహించారు. కార్యక్రమాన్ని పారదర్శకంగా నిర్వహించాలని వారికి దిశానిర్దేశం చేశారు. కార్యక్రమాన్ని జైనథ్ మండలం జామిని గ్రామంలో అధికారికంగా ప్రారంభించనున్నారు. ఇందులో మంత్రి సీతక్కతో పాటు జిల్లా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొననున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీ స్కీమ్‌ల అమలుకు సంబంధించి స్వీకరించనున్న నిర్ణీత ప్రొఫార్మాతో కూడిన దరఖాస్తులు జిల్లాకు చేరగా వాటిని పంచాయతీ కార్యదర్శులు, మున్సిపల్ సిబ్బందికి అందజేశారు.

సర్వం సిద్ధం
జిల్లాలోని 468 గ్రామ పంచాయతీలు, ఏకైక ఆదిలాబాద్ మున్సిపాలిటీలో నేటి నుంచి జనవరి 6వరకు గ్రామ, వార్డు సభలు నిర్వహించనున్నారు. ఇందు కోసం గ్రామాలు, వార్డుల వారీగా ఇప్పటికే తహసీల్దార్, ఎంపీడీవో, ఎంపీవోల ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలను నియమించారు. అలాగే ఏ వార్డు, ఏ గ్రామంలో ఎప్పుడు సభ నిర్వహించాలనే దానిపై ఇప్పటికే ప్రత్యేక షెడ్యూలును రూపకల్పన చేసిన అధికారులు వాటి వివరాలను పంచాయతీ కార్యదర్శులు, వార్డు ప్రత్యేకాధికారులకు అందజేశారు. ఆ షెడ్యూలు ప్రకారం సంక్షేమ పథకాలకు సంబంధించిన దరఖాస్తులు స్వీకరించేలా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. వంద మంది కుటుంబాలకు ఒకటి చొప్పున కౌంటర్‌ను ఏర్పాటు చేస్తున్నారు. పంచాయతీ కారోబార్, ఫీల్డ్ అసిస్టెంట్, టెక్నికల్ అసిస్టెంట్‌ను గ్రామ పంచాయతీల్లో, అలాగే మున్సిపల్, మెప్మా సిబ్బందిని మున్సిపల్ పరిధిలో దరఖాస్తుల స్వీకరణ కోసం నియమించారు. అప్లికేషన్లు అందజేసేందుకు వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా షామియానాలు, కుర్చీల ఏర్పాటుతో పాటు తాగునీటి వసతి కల్పించనున్నారు.

అధికారికంగా దరఖాస్తు ప్రతుల అందజేత
కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చిన ఆరు గ్యారంటీలైన మహాలక్ష్మి రూ.2500 ఆర్థికసాయం, రూ.500 గ్యాస్ సిలిండర్, రైతు భరోసా కింద ఎకరానికి రూ.15వేలు, కౌలు రైతులకు రూ.12వేలు, ఇందిరమ్మ ఇండ్లు, గృహ జ్యోతికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్, చేయూత ద్వారా వివిధ కేటగిరీల వారికి పింఛన్ వంటివి ఇందులో ఉన్నాయి. లబ్ధిదారుల ఎంపికలో భాగంగా నిర్ణీత ప్రొఫార్మాతో కూడిన దరఖాస్తులు ప్రభుత్వం నుంచే జిల్లాకు చేరాయి. డీఆర్‌డీఏ కార్యాలయానికి చేరిన వీటిని బుధవారం ఎంపీడీవోల ద్వారా అన్ని పంచాయతీ కార్యదర్శులు, మున్సిపల్ సిబ్బందికి పంపిణీ చేశారు. వారి పరిధిలోని అర్హులైన వారికి వీటిని అందజేయనున్నారు. తమకు ఏ పథకాలు అవసరమని భావిస్తారో వాటి వివరాలను అర్హులైన వారు పూర్తి చేయాల్సి ఉంటుంది. పూర్తి చేసిన దరఖాస్తుకు ఆధార్ కార్డు, రేషన్‌కార్డు ఒక ఫొటోను జత చేసి గ్రామాల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్లలో అందజేస్తే అక్కడి సిబ్బంది వాటిని స్వీకరించి వారికి రశీదులు అందజేస్తారు. అనంతరం రోజువారీగా అందిన దరఖాస్తులను ఏ రోజుకారోజు పంచాయతీ, మున్సిపల్ సిబ్బంది ఆన్‌లైన్ చేయడంతో పాటు ఉన్నతాధికారులకు అందజేయనున్నారు.

మున్సిపల్ పరిధిలో రణదీవేనగర్‌లో షురూ..
ఆదిలాబాద్ మున్సిపల్ పరిధిలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన కార్యక్రమాన్ని రణదీవేనగర్ కాలనీలోని సవారీబంగ్లా వద్ద గురువారం ప్రారంభించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఏ.శైలజ తెలిపారు. ఇందు కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. ఉదయం 8గంటలకు మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని తెలిపారు. అర్హులైన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.





ఆదిలాబాద్‌లోని మీసేవ కేంద్రం లోపల, బయట బారులు తీరిన జనం

ఆధార్.. బారులు!

ఉజ్వల వంట గ్యాస్ కనెక్షన్‌కు సంబంధించిన ఈకేవైసీ గడువు సమీపిస్తుండటంతో మీసేవ కేంద్రాలు వినియోగదారులతో రద్దీగా మారుతున్నాయి. ఆధార్ అప్‌డేట్ కోసం వందలాది మంది ఆయా కేంద్రాలకు పరుగు తీస్తున్నారు. ఇందులో భాగంగా ఆదిలాబాద్‌లోని కలెక్టరేట్ పక్కనున్న ప్రభుత్వ మీసేవ సెంటర్ సందడిగా మారింది. జనం రోడ్డు వరకు బారులు తీరి కనిపించారు. వారిని నియంత్రించేందుకు నిర్వాహకులకు తిప్పలు తప్పలేదు. చివరకు పోలీసులను రప్పించి ప్రధాన ద్వారం గేట్లు మూసివేయించడం గమనార్హం. కాగా ఆధార్‌లో మార్పులు, చేర్పుల కోసం తమ పిల్లలతో కేంద్రాలు తెరువక ముందే జనం అక్కడికి చేరుకుంటున్నారు. సాయంత్రం వరకు తమ వంతు కోసం నిరీక్షిస్తున్నారు. పనివేళలు ముగిసినా అవకాశం రాక కొంతమంది నిరాశగా వెనుదిరగాల్సి వస్తోంది. ఈకేవైసీ అప్‌డేట్ గడువు పెంచడంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లోనూ ప్రక్రియ చేపట్టేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. –కైలాస్‌నగర్

వందశాతం ఉత్తీర్ణత సాధించాలి

తలమడుగు: ఈ విద్యాసంవత్సరం ఇంటర్ ఫలితాల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలని డీఐఈవో రవీందర్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను బుధవారం ఆయన తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. కష్టపడి చదవాలని వారికి సూచించారు. ఇందులో ప్రిన్సిపాల్ మాధవరావు, అధ్యాపకులు సుర్యకాంత్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఐఈవో రవీందర్

క్లుప్తంగా

చోరీ కేసులో నిందితుల పట్టివేత


పట్టుబడ్డ నిందితులతో పోలీసులు

కుంటాల: మండలంలోని కల్లూర్ శ్రీలక్ష్మి సాయి వైన్స్‌లో గత శుక్రవారం జరిగిన చోరీలో రూ.92వేలా 800 విలువైన మద్యాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. ఐదు రోజుల వ్యవధిలోని పోలీసులు దొంగతానికి పాల్పడిన నిందితులను పట్టుకున్నారు. ఎస్సై హన్మండ్లు కథనం ప్రకారం.. మండలంలోని 61 జాతీయ రహదారి కల్లూరు వాసవి డిగ్రీ కళాశాల వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా ఓ కారులో ఇందులో రూ.15వేల640 విలువల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. విచారణ చేసి కారులోని ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. భైంసాకు చెందిన ఒకరు, లక్సెట్టిపేటకు చెందిన ఇద్దరిని గుర్తించగా మరో ముగ్గురు పరారీలో ఉన్నట్లు తెలిపారు. వీరి కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు ఎస్సై వెల్లడించాడు.

మహిళ ఆత్మహత్య

నిర్మల్‌టౌన్: జీవితంపై విరక్తితో ఓ మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన బుధవారం జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. పొలకొండ లక్ష్మి (42) భర్త, ఇద్దరు ఆడ పిల్లలతో కలిసి స్థానిక ధ్యగావాడలో నివసిస్తోంది. వృత్తిరీత్యా భార్యాభర్తలిద్దరూ కుట్టుమిషన్ కుట్టేవారు. భర్త నిజామాబాద్‌లోని బంధువుల ఇంటికి మంగళవారం వెళ్లాడు. కొంతకాలంగా కడుపు నొప్పితో బాధపడుతున్న లక్ష్మి పలు ఆస్పత్రుల్లో చూపించుకున్నప్పటికీ నయం కాలేదు. బుధవారం ఉదయం లక్ష్మి జీవితంపై విరక్తితో ఇంట్లో ఉరేసుకుంది. గమనించిన కూతురు, మామ వెంటనే కిందకు దింపి ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలిస్తుండగా మృతిచెందింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ పురుషోత్తం తెలిపారు.

కౌలురైతు ఆత్మహత్య


శ్రీనివాస్ మృతదేహం

బోథ్: మండలంలోని నేరేడుపల్లె గ్రామానికి చెందిన ఆత్రం శ్రీనివాస్(23) కౌలురైతు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. ఎస్సై రాము వివరాల ప్రకారం... శ్రీనివాస్ 13ఎకరాలు కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నాడు. ఆశించిన స్థాయిలో పత్తిదిగుబడి రాకపోవడంతో మంగళవారం రాత్రి సమయంలో చేనులో పురుగుల మందు తాగాడు. ఇంటికి రాకపోవడంతో స్థానికులు చేనులోకి వెళ్లిచూడగా అప్పటికే మృతిచెంది కనిపించాడు. మృతుడి సోదరుడు ఆత్రం భీంరావ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అప్పులు తీర్చేమార్గం లేక మరో కౌలురైతు..

ఆదిలాబాద్‌టౌన్: మహారాష్ట్రలోని కిన్వట్ తాలుకా బెల్లారికి చెందిన టేకం భీమా(19) రిమ్స్‌లో చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందినట్లు టూటౌన్ హౌజ్ ఆఫీసర్ బబితా తెలిపారు. ఆమె కథనం ప్రకారం.. టేకం భీమా రెండు ఎకరాల భూమిని కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తున్నాడు. పంట సాగు కోసం అప్పులు చేశాడు. పంటలు సరిగ్గా పండక, అప్పులు తీర్చే మార్గం కనిపించకపోవడంతో మనస్తాపానికి గురై ఈనెల 24న పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలో ఇంటికి చేరుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు మెరుగైన వైద్యం కోసం జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. సోదరుడు వికాస్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఖానాపూర్: చిన్ననాటి నుంచే కూతురి ఆసక్తి మేరకు ఆయా రంగాల్లో ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులకు.. పేరుప్రఖ్యాతలు తెచ్చేలా పలు రంగాల్లో రాణిస్తున్న చిన్నారి శాన్విక ఎంతోమందికి ఆదర్శంగా నిలుస్తోంది. కరాటేతో పాటు నృత్య రంగాల్లో చిచ్చర పిడుగులా ప్రతిభను చాటుతూ అందరినోట శెభాశ్ అనిపించుకుంటుంది. ఓ వైపు బడికి వెళ్తూనే మరోవైపు కూచిపూడి, భరతనాట్యం వంటి నృత్య కళల్లో రాణిస్తోంది. నృత్యంతో పాటు కరాటే విభాగంలోనూ ప్రతిభను చాటుతూ అందరి మన్ననలు పొందుతోంది శాన్విక..

బహుకళ రూపిణి..శాన్విక


నృత్యం చేస్తున్న చిన్నారి శాన్విక

- భారతీయ నృత్యాలు, కరాటే పోటీల్లో రాణింపు
- అన్ని రంగాల్లో ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులు
- ఉత్తమ ప్రతిభ కనబర్చుతున్న చిన్నారి
- పిన్నవయస్సులోనే పలు జాతీయ అవార్డులు కైవసం

చిన్ననాటి నుంచే...

మండలంలోని గోసంపల్లె గ్రామానికి చెందిన బలస్తు సోనితాయ్–శివరామకృష్ణ దంపతులు జిల్లా కేంద్రంలోని ప్రైవేటు కళాశాలల్లో అధ్యాపకులుగా పనిచేస్తూ అక్కడే నివాసం ఉంటున్నారు. ఆరేళ్ల కూతురు శాన్విక వాసవి పాఠశాలలో యూకేజీ చదువుతోంది. గతంలో హైదరాబాద్‌లో జరిగిన పలు ప్రదర్శనల్లో రాణించి ఉత్తమ ప్రతిభ చాటింది. కూతురిని ఆయా రంగాల్లో ప్రోత్సహించడంతో పాటు చిన్నారిలో దేశభక్తిని పెంపొందిస్తూనే పలు సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేస్తున్నారు తల్లిదండ్రులు. రోడ్డుపై ఉండే అన్నార్తులకు దుప్పట్లు, ఆహారం ప్యాకెట్లు బాలిక చేత అందజేయిస్తున్నారు. ఇటీవల ఎన్నికల్లోనూ నిర్మల్ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థికి సైతం తానుదాచుకున్న కిడ్డి బ్యాంక్‌ను అందజేసింది.

ఇటీవల గిన్నిస్ రికార్డులో..

- 4 అగస్టు 2023లో హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో శ్రీకృష్ణసేవా సమితి ఆధ్వర్యంలో జరిగిన భరత నాట్య పోటీల్లో ప్రతిభ కనబరిచి అప్పటి మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు చేతుల మీదుగా స్వర్ణ నంది పురస్కారాన్ని అందుకుంది.
- హైదరాబాద్‌లోని ఎల్వీ ప్రసాద్ డిజిటల్ ఫిలిమ్ ల్యాబ్‌లో 25 ఏప్రిల్ 2023న ''డ్యాన్స్ ఎక్సలెన్సీ అవార్డు–2023''లో భాగంగా కూచిపూడి నృత్య ప్రదర్శనలో ప్రశంస పత్రంతో పాటు గోల్డ్‌మెడల్‌ను పండితులు దైవజ్ఞశర్మ చేతుల మీదుగా అందుకుంది.
- 2 జూన్ 2022న రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవంలో భాగంగా నిర్మల్ కలెక్టరేట్‌లో నిర్వహించిన నృత్య సమ్మేళనంలో అప్పటి కలెక్టర్ ముషారఫ్ అలీ చేతుల మీదుగా అవార్డు అందుకుంది.


గిన్నిశ్ రికార్డు ప్రదర్శనలో మంత్రి సీతక్క

- వెన్నెల డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో 2022 బాలోత్సవంలో పాల్గొని అప్పటి మంత్రి ఐకే రెడ్డి చేతుల మీదుగా ప్రోత్సాహిక బహుమతి అందుకుంది.
- 23 ఏప్రిల్ 2023న హైదరాబాద్‌లోని ఎల్వీ ప్రసాద్ డిజిటల్ ఫిలిమ్‌ల్యాబ్‌లో నాట్యం ఐకాన్ అవార్డు–2023 పోటీల్లో భరత నాట్యంలో అవార్డు అందుకుంది.
- 17 డిసెంబర్ 2023న కరాటే విభాగంలో ఎల్లో బెల్ట్ అందుకుంది.
- 2022 సీఎం కేసీఆర్ కప్‌లో కరాటే(కటా) విభాగంలో సినీహీరో సుమన్ చేతుల మీదుగా గోల్డ్‌మెడల్ అందుకుంది.
- 24 డిసెంబర్ 2023న హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో 8వేల మంది కళాకారులతో చేపట్టిన గిన్నిస్ బుక్ రికార్డు ప్రదర్శనలో పాల్గొని ప్రశంస పత్రం అందుకుంది.
- ఆజాదిక అమృత్ మహోత్సవాల్లో భాగంగా జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో జరిగిన వేడుకల్లో చిన్నవయస్సులోనే జాతీయ గీతాలపన చేసి మంత్రి, కలెక్టర్‌చే ప్రశంసాపత్రం అందుకుంది.
- బాలిక చేస్తున్న ప్రదర్శనలు వారి తల్లిదండ్రులు ఏర్పాటు చేసిన యూటుబ్ చానల్‌తో పాటు సోషల్ మిడియాలో పోస్టులు పెట్టి అందరికి తెలిసేలా చేస్తున్నారు.

కూతురంటే ప్రాణం..



అడపిల్లంటే బరువనే భావన లేకుండా పెంచుతున్నాం. ఆసక్తి ఉన్న రంగాల్లో ప్రోత్సహిస్తున్నాం. భవిష్యత్‌లో ఇదే తరహాలో ప్రోత్సాహాన్ని అందిస్తాం. జీవితంలో బాధ్యతతో పాటు సామాజిక స్పృహ, దేశభక్తి ఉండాలని చిన్ననాటి నుంచే వారికి చెబుతున్నాం.

– సోనితాయ్, శివరామకృష్ణ, శాన్విక తల్లి దండ్రులు

అధికారిక సమీక్షలో... అనధికారుల దర్పం!


సమావేశంలో పాల్గొన్న కంది శ్రీనివాసరెడ్డి

ప్రజాపాలన అమలుపై రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణా భివృద్ధి శాఖ మంత్రి సీతక్క ఆదిలాబాద్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులతో బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్, బోథ్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జీలు కంది శ్రీనివాసరెడ్డి, ఆడె గజేందర్ తమ వ్యక్తిగత సిబ్బంది కలిసి పాల్గొనడం గమనార్హం. హస్తం పార్టీ నేతలు అధికార దర్పాన్ని ప్రదర్శించడంపై విమర్శలు వ్యక్తమయ్యాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్


అధికార సమావేశంలో కాంగ్రెస్ ఇన్‌చార్జీలు

విద్యార్థి అదృశ్యం

- పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన ప్రిన్సిపాల్

ముధోల్: మండల కేంద్రంలోని టీఎస్‌డబ్ల్యూఆర్‌జేఎస్ జూనియర్ కళాశాల నుంచి విద్యార్థి అదృశ్యమైనట్లు ప్రిన్సిపాల్ అమృతయ్య పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ వివరాల ప్రకారం... తానూర్ మండలంలోని వడ్‌గావ్ గ్రామానికి చెందిన మద్‌నూరే సాయినాథ్(15) టీఎస్‌డబ్ల్యూఆర్‌జేఎస్‌లో బైపీసీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఈ నెల 26వ తేదీ మంగళవారం ఉదయం 10గంటల ప్రాంతంలో హాజరుతీసుకోగా సదరు విద్యార్థి హాజరు కాలేదు. దీంతో కళాశాలలో లేడని గుర్తించి తల్లిదండ్రులకు సమాచారం అందజేశారు. భైంసా, ముధోల్ ప్రాంతాల్లో సైతం వెతకడం జరిగిందని ప్రిన్సిపాల్ తెలిపాడు. బుధవారం కళాశాలకు విద్యార్థి తల్లిదండ్రులు చేరుకుని ఉపాధ్యాయులతో మాట్లాడారు. వారి బంధువుల ఇళ్లల్లోనూ ఆరా తీశారు. దీంతో ప్రిన్సిపాల్ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సదరు విద్యార్థి కళాశాల వెనుక ఉన్న గోడ దూకి పారిపోయి ఉండొచ్చని అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

ఒకరి అదృశ్యం


నాందేవ్

ఇంద్రవెల్లి: చేపల వేటకు వెళ్లి ఒకరు అదృశ్యమైన ఘటన మండలంలోని అంజి గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై దుబ్బాక సునీల్ వివరాల ప్రకారం.. అంజి గ్రామానికి చెందిన గారుశే నాందేవ్ అదే గ్రామానికి చెందిన రమేష్, మారుతి, డిగంబర్లతో కలిసి మంగళవారం రాత్రి చేపల వేటకు కొబ్బయ్‌గూడ చెరువుకు వెళ్లారు. చేపలు పడుతుండగా గుర్తు తెలియని వ్యక్తి దూరం నుంచి టార్చ్‌లైట్ కొట్టడంతో అందరూ పారిపోయారు. అందులో ముగ్గురు రమేష్, మారుతి, డిగంబర్ ఒకేచోటకు చేరుకున్నారు. వారితో వచ్చిన నాందేవ్ కోసం గాలించినా ఆచూకీ కనిపించలేదు. అయితే బుధవారం ఉదయం నాందేవ్ భార్య సుమన్ బాయి తన భర్త రాలేదని తెలుపడంతో చెరువు చుట్టుపక్కల గాలించారు. దీంతో కుటుంబ సభ్యులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

హత్య కేసులో ఇద్దరు నిందితులు అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ నాగేందర్

ఇచ్చోడ: మండల కేంద్రంలో సిరిచెల్మ చౌరస్తాలో మంగళవారం జరిగిన వానోలే ఈశ్వర్ హత్య కేసులో ఇద్దరు నిందితులు వానోలే పాండురంగ్, వానోలే సూర్యకాంత్‌లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించనున్నట్లు ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్ తెలిపారు. బుధవారం ఇచ్చోడ సీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈశ్వర్‌కు, నిందితులు పాండురంగ్, సూర్యకాంత్‌లకు ఏడాదిగా భూవివాదాలు ఉన్నాయని తెలిపారు. భూ వివాదంలో ఈశ్వర్ అడ్డువస్తున్నాడని భావించిన పాండురంగ్, అతడి కుమారుడు సూర్యకాంత్ మంగళవారం ఉదయం 9గంటల ప్రాంతంలో సిరిచెల్మ చౌరస్తాలో ఈశ్వర్ కోసం కాపుకాశారు. ఈశ్వర్ టీచర్స్‌కాలనీలోని ఇంటి నుంచి పాన్‌టేలకు రాగానే అతడిపై గొడ్డలితో తండ్రి కొడుకులు దాడికి పాల్పడ్డారు. దీంతో ఈశ్వర్ పరుగెత్తడంతో వెంబడించి గొడ్డలి, కత్తి, సుత్తెతో కొట్టి హత్యచేశారు. ఈ సంఘటనలో ఇచ్చోడ సీఐ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఇచ్చోడ, నేరడిగొండ ఎస్సైలు నిందితులను బుధవారం పట్టుకుని అరెస్టు చేసినట్లు తెలిపారు. ఇద్దరు నిందితులను రిమాండ్‌కు తరలించనున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో ఇచ్చోడ సీఐ చంద్రశేఖర్, ఇచ్చోడ, నేరడిగొండ ఎస్సైలు నరేష్, సాయన్న పాల్గొన్నారు.

అటవీ జంతువులను వేటాడితే చర్యలు


పట్టుకున్న మాంసంతో అధికారులు

ఇంద్రవెల్లి: వన్యప్రాణులను వేటాడితే కఠిన చర్యలు తప్పవని ఇంద్రవెల్లి అటవీశాఖ రెంజ్ అధికారులు సంతోష్ హెచ్చరించారు. మండల కేంద్రంలో అడవి పంది మాంసం అమ్ముతూ పట్టుబడిన ఉమ, దత్తత్రిలపై కేసు నమోదు చేసి బుధవారం జూనియర్ సివిల్ జడ్జి కం జ్యూడిషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ కోర్ట్ బోథ్‌కు రిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు ఆయన మాట్లాడుతూ చెట్లు నరికినా, వన్య ప్రాణులను వేటాడి హతమార్చిన కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఎస్‌వోలు నర్సయ్య, గోవింద్, చంద్రరెడ్డి, సిబ్బంది ఉన్నారు.

మెస్రం నాగోరావ్ మృతి


నాగోరావ్ (ఫైల్)

ఇంద్రవెల్లి: నాగోబా మహాపూజలు ప్రారంభం నుంచి నాగోబా జాతర పూజలు ముగింపు వరకూ వచ్చే మెస్రం వంశీయులకు, భక్తులకు నాగోబా చరిత్రపై సన్నాయి వాయిస్తూ పాటల రూపంలో వివరించే మండల కేంద్రంలోని ప్రధాన్‌గూడ గ్రామానికి చెందిన మెస్రం నాగోరావ్ (65) అనారోగ్యంతో బుధవారం ఉదయం మృతిచెందాడు. కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న మెస్రం నాగోరావ్‌ను కుటుంబ సభ్యులు ఆస్పత్రిలో చూపించినా నయం కాలేదు. ఆరోగ్య పరిస్థితి విషమించి బుధవారం ఇంట్లో మృతి చెందాడు. ఆయన మృతి మెస్రం వంశీయులకు తీరనిలోటని మెస్రం వంశం పెద్దలు ఆవేదన వ్యక్తం చేశారు.

ఆదిలాబాద్: మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పిస్తూ మహాలక్ష్మి పథకానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టడంతో ఆర్టీసీ బస్సుల్లో మహిళ ప్రయాణికుల సంఖ్య ఒక్కసారిగా పెరిగిపోయింది. మహిళా ప్రయాణికులు ఆర్టీసీ బస్సులకు ప్రాధాన్యమిస్తుండడంతో బస్సులు కిక్కిరిసిపోతున్నాయి. పలు సందర్భాల్లో కండక్టర్లు టికెట్లను ఇష్యూ చేయడం విషయంలో ఇబ్బందులు సైతం ఎదుర్కొంటున్నారు. ఇదే అదనుగా పలు వురు చోరీలకు పాల్పడుతున్నారు. ప్రయాణికుల సంఖ్య అధికంగా ఉండడంతో చేతివాటం ప్రదర్శిస్తున్నారు. చేతికి అందిన కాడికి తస్కరించకపోతున్నారు. దీంతో ప్రయాణికులకు భద్రత కరువైంది.

సందట్లో సడేమియా


ఆదిలాబాద్ బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ

- ఆర్టీసీ బస్సుల్లో చేతివాటం
- రద్దీ పెరగడంతో దొంగతనాలు

పల్లెవెలుగు బస్సుల్లో అధికంగా..

ప్రభుత్వం పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయాన్ని కల్పించింది. ఎక్స్‌ప్రెస్ సర్వీసులు సాధారణంగా దూరప్రాంతాలకు కేటాయిస్తారు. దూర ప్రాంతాలకు ప్రయాణికుల సంఖ్య సాధారణంగా ఉంటుంది. అయితే పల్లె వెలుగు బస్సులను కొన్ని గ్రామాలకు కలిపి నడుపుతుండడం వలన అధిక సంఖ్యలో ప్రయాణికులు ప్రయాణిస్తుంటారు. పల్లె వెలుగు బస్సులు ప్రయాణికులతో నిండిపోతున్నాయి. అదునుగా "పర్సులు, గోల్డ్ చైన్లు, ఫోన్లు వంటి వాటిని కొట్టేస్తుండడం గమనార్హం. ఉచిత ప్రయాణం అంటూ విలువైన వస్తువులను పోగొట్టుకోవాల్సి వస్తుందని పలువురు ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బస్ స్టేషన్లలోనూ చోరీలు...

పథకం ప్రారంభమైన నాటి నుంచి బస్టాండ్లలో ప్రయాణికుల సంఖ్య అధికంగా దర్శనమిస్తోంది. ఇటువంటి సమయంలోనే చోరులు చెలరేగుతున్నారు. బ్యాగులు, పర్సులను మాయం చేస్తున్నారు. ఇటీవలే నిర్మల్ బస్టాండ్ లో ఓ వైద్యురాలి బ్యాగ్ నుంచి ఏడు తులాల బంగారం చోరీ అయింది. బస్సులలో, బస్టాండ్లలో అధికంగా మహిళా ప్రయాణికులే ఉంటుండడంతో వారిని దొంగలు టార్గెట్ చేస్తున్నారు. శుభకార్యాలు సీజన్ కావడంతో మెల్లగా తమ పని కానిచ్చేస్తున్నారు.

చర్యలు తీసుకుంటున్నాం...



బస్సులు, బస్టాండ్లలో రద్దీ నేపథ్యంలో చోరీలు జరిగే అవకాశం లేకపోలేదు. ప్రయాణికులు సైతం అప్రమత్తంగా ఉండాలి. ప్రయాణికుల భద్రత కోసం ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. ప్రత్యేక పోలీస్ సిబ్బందిని ఏర్పాటు చేసేందుకు పోలీస్ అధికారులకు విన్నవించాం. రీజియన్ పరిధిలోని అన్ని ప్రధాన బస్‌స్టేషన్లలో సీసీ కెమెరాలు ఉన్నాయి. బస్టాండ్లలో బస్సులలో ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నాం.

– ఆదిలాబాద్ ఆర్టీసీ ఆర్‌ఎం సోలోమన్

గిరిజన గ్రామాల్లో ఎక్సైజ్ అధికారుల దాడులు


బెల్లంపాకం పారబోస్తున్న ఎక్సైజ్ అధికారులు

సారంగపూర్: మండలంలోని దేవితండాలో బుధవారం నిర్మల్ ఎక్సైజ్ ఎస్సై రాయబారపు రవికుమార్ తన సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా తండాకు చెందిన కాంతాబాయి అనే మహిళ ఇంట్లో ఐదు లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకుని ఆమెపై కేసు నమోదు చేశారు. దీంతో పాటు సమీప పంటపొలాల్లో గుడుంబా తయారు చేస్తున్నారని సమాచారం మేరకు తనిఖీలు చేపట్టగా మొక్కజొన్న, పత్తి పంటక్షేత్రాల్లో మూడువందల లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. గ్రామాల్లో గుడుంబా తయారు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతిరోజు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి గుడుంబా తయారీని అడ్డుకుంటామన్నారు. ఆయన వెంట సిబ్బంది రషీద్, నరేష్, సాయి, ఇర్ఫాన్, రవలి ఉన్నారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

కుంటాల: మండలంలోని అంబకంటి గ్రామశివారులో బుధవారం పేకాట స్థావరంపై దాడి చేసినట్లు ఎస్సై హన్మండ్లు పేర్కొన్నారు. ముగ్గురు వ్యక్తులు పేకాడుతుండగా వీరివద్ద నుంచి రూ.2,289 నగదు స్వాధీనం చేసుకున్నామని ఎస్సై తెలిపారు. వీరిపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

చిరుత దాడిలో ఆవు మృతి


మృతిచెందిన ఆవు

గుడిహత్నూర్: మండలంలోని ధామన్‌గూడ పంచాయతీ పరిధిలోని అటవీ క్షేత్రంలో మంగళవారం రాత్రి చిరుత దాడిలో ధామన్‌గూడ గ్రామానికి చెందిన రైతు మానేకర్ కృష్ణకు చెందిన ఆవు మృతి చెందినట్లు బాధితుడు తెలిపాడు. మేత కోసం వెళ్లిన ఆవు తిరిగి ఇంటికి రాక పోవడంతో అటవీ ప్రాంతంలో పరిశీలించగా కళేబరం కనిపించింది. సమాచారం అందుకున్న అటవీశాఖ అధికారులు సంఘటన స్థలానికి చేరుకుని అనవాళ్లు పరిశీలించారు. చిరుతపులి దాడిలో ఆవు మృతి చెందినట్లు ధ్రువీకరించారు.

దరఖాస్తులు అందించాలి

నిర్మల్‌ఖిల్లా: ఆరు గ్యారంటీల అమలు కోసం ఈనెల 28 నుంచి జనవరి 6 వరకు పది రోజుల పాటు నిర్వహించే 'ప్రజాపాలన' కార్యక్రమంలో గల్ఫ్ బాధిత కుటుంబాల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ప్రకటించిన నేపథ్యంలో సంబంధిత ప్రజలు దరఖాస్తులు సమర్పించాలని ప్రవాసీమిత్ర కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు స్వదేశ్ పర్కిపండ్ల సూచించారు. గల్ఫ్ జేఏసీ పిలుపు మేరకు ఉపాధి కోసం గల్ఫ్ దేశాలకు వలసవెళ్లి మృతిచెందిన కార్మికులకు రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియా, గల్ఫ్ సంక్షేమ బోర్డు స్థాపన వంటి హామీల అమలు కోసం వినతి పత్రాలను అందించాలని పేర్కొన్నారు.

సావిత్రీబాయి పూలే జయంతిని అధికారికంగా నిర్వహించాలి

ఆదిలాబాద్‌రూరల్: భారతదేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రీబాయి పూలే జయంతిని 3 జనవరి 2024న అధికారికంగా నిర్వహించాలని అఖిల భారతీయ మాలీ మహా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుకుమార్ పేట్కులే ప్రభుత్వాన్ని కోరారు. జిల్లా కేంద్రంలోని పూలే విశ్రాంతి భవనంలో సంఘ కార్యకర్తలతో కలిసి సుకుమార్ మాట్లాడుతూ భారతదేశంలో స్త్రీవిద్యకు నాంది పలికి, మహిళా సాధికారిత కోసం, సమసమాజ నిర్మాణం కోసం ఆజన్మాంతం కృషి చేసిన చదువుల తల్లి సావిత్రిబాయి పూలేనన్నారు. నూతనంగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేసిన రోజే ప్రగతి భవన్‌కు మహాత్మాజ్యోతిరావు పూలే ప్రజాభవన్‌గా ప్రజలకు అందుబాటులోకి తేవడం హర్షణీయమన్నారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాంబన్న శేండే, రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షులు ఉమేష్ రావు డోలే, జిల్లా పటేళ్ల సంఘం అధ్యక్షులు గంగారాం శేండే, మాలి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్ అంబేకర్, కార్యవర్గ సభ్యులున్నారు.

ప్రజలకు సేవ చేయడంలోనే ఆనందం

- పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క


సన్మానిస్తున్న సర్పంచుల సంఘం నాయకులు

కైలాస్‌నగర్: ప్రజాప్రతినిధి అంటేనే ఒక సేవఅని, ప్రజలకు సేవచేస్తూ ఆనందం పొందాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి సీతక్క అన్నారు. మంత్రి హోదాలో తొలిసారి జిల్లాకు హాజరైన ఆమెకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా సర్పంచ్‌ల సంఘం ఆధ్వర్యంలో బుధవారం స్థానిక జెడ్పీ సమావేశ మందిరంలో ఆత్మీయ సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సర్పంచ్‌లు శాలువ, గజమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సర్పంచులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని గమనించానన్నారు. గత పాలకుల అబద్ధాల కారణంగా ఎంతో మంది సర్పంచులు ఇబ్బందులపాలయ్యారన్నారు. అభివృద్ధి పనులకు సంబంధించి బిల్లులు రాక సర్పంచులు ఆత్మహత్యలకు పాల్పడటం బాధాకరమని తెలిపా రు. ప్రభుత్వ సంక్షేమ పథకాల దరఖాస్తుల ప్రక్రియలో సర్పంచులందరూ భాగస్వాములు కావా లని పిలుపునిచ్చారు. త్వరగా సర్పంచుల సమస్యలను పరిష్కరిస్తామని భరోసానిచ్చారు. ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, సర్పంచుల సంఘం అధ్యక్షులు భూమన్న యాదవ్, తదితరులు పాల్గొన్నారు.